# పీజీఈసెట్‌కు 24,550 దరఖాస్తులు

## ▸ 28 నుంచి పరీక్షలు, 19 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్

హైదరాబాద్ సిటీ, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఇంజనీరింగ్ పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (పీజీఈసెట్)- 2026కు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24,550 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈనెల 28 నుంచి 31 వరకు మొత్తం ఆరు సెషన్లలో 19 సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 19 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ వెల్లడించారు.

# జేఎన్‌టీయూలో పూర్వ విద్యార్థుల సమావేశం

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ ఈసీఈ విభాగం 1975-1985 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల సమావేశం ఆన్‌లైన్‌లో గురువారం జరిగింది. ఈసీఈ అధినేత టి.మాధవీకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పూర్వ విద్యార్థులు మాట్లాడారు. ఈసీఈ విభాగంలో వస్తున్న మార్పులు, జరుగుతున్న పరిశోధనలు, విద్యార్థులు దృష్టి సారించాల్సిన అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ అరవింద్ పట్వారి, పూర్వ విద్యార్థులు రమేష్, నరసింహారెడ్డి, సమ్మిరెడ్డి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

**మెకానికల్ విభాగంలో..**

మెకానికల్ విభాగంలో 2022 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం ఆన్‌లైన్‌లో జరిగింది. పూర్వ విద్యార్థి టి.సతీష్ మెకానికల్ విభాగంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, కెరీర్ ప్లానింగ్ తదితర అంశాలపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

**అలుమ్ని అసోసియేషన్ సమావేశం..**

జేఎన్‌టీయూ అలుమ్ని అసోసియేషన్ సమావేశం ఆన్‌లైన్‌లో జరిగింది. అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయ్ మోహన్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం అలుమ్ని నుంచి నిధులు సమకూర్చే అంశంపై చర్చించారు. 1992 బ్యాచ్ విద్యార్థులు ఇందు కోసం ముందుకొచ్చారన్నారు. ఆవిష్కరణలు, విద్యార్థుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లేందుకు ఈ నిధులు వెచ్చించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వర్సిటీ అలుమ్ని అఫైర్స్ డైరెక్టర్ డాక్టర్ పి.భ్రమర తదితరులు పాల్గొన్నారు.